


శ్రీశారదా మాత ప్రసంగములు..

*హిందూమతాచారము ప్రకారము పూజ్యులైనవారు తాకిన నీటిని, కాళ్ళు కడుగు కొనుటకు వాడకూడదు.

*ఎల్లప్పుడు నేదో యొక పని చేయుచుండుట వలన మనస్సునకును, శరీరమునకును గూడ ఆరోగ్యకరముగనుండును.

*నిష్కపటమైన భక్తిగలవారు భగవంతునకు అత్యంత ప్రియులు; కావుననే మన అంతరాత్మకు వారియందభిమానము.

*జగన్నాథములో రథమునందలి విష్ణు విగ్రహమును చూచిన వారికి భగవత్సాక్షాత్కారము కలుగునని హిందూ జన సామాన్యము యొక్క నమ్మకము.
*ఆడువారికి శీఘ్రముగా కోపము రాకూడదు. వారు సహనము నభ్యసింపవలయును. బాల్యమునందు వారికి తల్లిదండ్రులే రక్షకులు, యౌవనములో భర్త రక్షణము క్రింద నుందురు.సామాన్యముగా ఆడువారికి అభిమానము ఎక్కువగా నుండును. వారిని కలవరపరచుటకు ఒక మాటయే బాలును. ఈ రోజులలో మాటల కేమి కొదువ ? కనుక ఓర్పుతో వారు కష్టసమయములందు తల్లిదండ్రులను గాని భర్తలనుగాని యెదిరింపక వారికి విధేయులై యుండుటకు ప్రయత్నిపవలెను.
*కామినీ కాంచనముల రెండిటిని పరిత్యజింపుడని జనుల నందరిని ఆయన (రామకృష్ణులు) యెల్లపుడు హెచ్చరించుచుండెను. వాదోప వాదములు చేయుట ఆడువారికి తగదు. వాదమువలన నెంతటి బుద్ధిమంతులకును భగవంతుని గ్రహించుటకు సాధ్యము కాదు. బ్రహ్మము వాదము వలన తేలెడు విషయమా?
*ఆధ్యాత్మిక బోధను గ్రహించుటకు అభ్యాసకులకు అర్హత ఉండవలయును.
*సాత్విక గుణమువలన త్యాగమలవడును.
* సృష్టి సమయమున జనులు సత్వగుణ యుక్తమైన తేజస్సుతో బుట్టిరి. పుట్టినప్పటి నుండియు వారు జ్ఞానులే. ఈ కారణమువలన, జగత్తు యొక్క అనిత్య స్వభావమును వారు వెంటనే గ్రహించి, దానిని పరిత్యజించి, పారమార్థిక సాధన చేయుచుండెడి వారు. మిక్కిలి త్వరితముగా వారికి ముక్తి లభించుచుండెను . తన సృష్టి వ్యర్థమై పోవుచుండెనని సృష్టికర్త గ్రహించెను. ఇట్లు ముక్తి నొందిన జ్ఞానులు జగన్నాటక నిర్వహణమునకు

పనికి రాకుండిరి. పిమ్మట, భగవంతుడు సృష్టిని మరల ప్రారంభించి, సత్వముతో రజస్తమోగుణములను గూడ గలిపెను. ఆయన ఉద్దేశమపుడు నెరవేరెను.

*భార్యా భర్తలు మత సాధనలను గురించి యేకాభిప్రాయులైయున్నచో, ఆధ్యాతికాభివృద్ధి వారికి సులభముగా కలుగును.

*అవసరమైనచో గురువునకు కూడ మనమేది ధర్మమో చెప్పవలసినదే. శిశ్యులట్లు చేయుటలో దోషమెంత మాత్రమును లేదు. కాని గురువు నందు,శిశ్యునకు అచంచలమైన భక్తి యుండవలెను. గురుని ప్రవర్తన యెట్లున్నను, నాతనియందట్టి భక్తి కలిగియున్నచో, శిశ్యుడు ముక్తిని సాధింపగలుగును.

*తన యావజ్జీవము నొక మనుష్యుడు భగవత్సాక్షాత్కారము కొరకు ఎన్ని కఠిన సాధనలను చేసినను లాభము లేకుండును. కాని మఱియొకరికి ప్రాయికముగా ఏకృషియు లేకయే పరమార్ధము లభించును.
ఇది భగవంతుని దయపై ఆధారపడియున్నది. ఆయన కిష్టమున్న వారికి తన దయను ప్రసాదించును. దైపకృపయే బహు ముఖ్యము.

*ప్రేమ లేనిదే భగవంతుడు ప్రసన్నుడు కాజాలడు.

*ఎవరైనను ప్రతి దినము భగవంతుని భగవద్దర్శనమును బడయగలరా? ప్రతిదినము గాలము వేసిన వెంటనే చేపదొరకునా? ఎన్నిసారులో అతనికి ఆశా భంగము కలుగును. కనుక సాధకుడు సాధనను సడలించ వలదు జపమును (భగవన్నామస్మరణమును) వెనుకటి కంటెను ఎక్కువ గా చేయుచుండవలెను.

*భగవన్నామమునకును, భగవంతునకు భేదమేమియు లేదు. ఆరంభ దశలో మనస్సేకాగ్రముగ నిలువ లేక పోయినను చిట్ట చివరకు జయము గాంతువు.

*మానవ శరీరమును చూచు చున్నారుగా! ఇది నేడున్నది, రేపుండదు. ఈ ప్రంపంచము దుఃఖమయము. వెఱొక జన్మ మెత్తుటకు జనులేల కోరి వ్యసన పడవలయును. దాని నైసర్గిక బాధల నుండి శరీర మెన్నటికిని తప్పించు కొనజాలదు.
*మన మెల్లప్పుడు పని చేయు చుండవలయును. పనిలేకుండ మన మెన్నడు నుండరాదు. సోమరులమై యుందుమేని బహు విధములైన చెడుతలంపులన్నియు మనస్సులో బయలుదేరును. అడవి యేనుగు వంటిది ఈ మనస్సు. అది వాయు వేగముతో బరుగెత్తుచుండును. కనుక మనమెల్లప్పుడు వివేచన / విచారణ చేయు చుండవలయును. భగవత్సాక్షారామునకు మనము కష్టపడి సాధన చేయవలయును.
*ధ్యానము చేయుచుండు నపుడు కుడిప్రక్క నుండి నాదము వచ్చును. శరీరస్మృతి యున్నప్పుడు మాత్రమే, ఎడమ ప్రక్క నుండి నాదము వచ్చును. కుండలినీ శక్తి ఉర్ధ్వముఖమైనపుడు ఈ సంఘటనలు జరుగును. కుడి ప్రక్కనుండి వచ్చునాదమే నిజమైనది. కొంత కాలమునకు మనస్సే గురువగును. ఏకాగ్ర చిత్తముతో రెండు నిమిశములైనను భగవంతుని ప్రార్థించుటయును ధ్యానించుటయును చంచలమైన మనస్సుతో గంటలకొలది చేయు జపతపాదుల కంటె చాలమేలు.
*శ్రీరామకృష్ణ గురు దేవులు బహు కఠిన తపస్సు చేసి మానవకోటి విమోచనకై దాని నెల్ల ధారవోసెను.
*శరీరము వేఱు, ఆత్మ వేరు. ఆత్మ శరీరమంతట నిండి యుండును. అందుచేతనే నా కాలులోని బాధ నాకు తెలియుచున్నది. ఈ మోకాలు లో నుండి నా మనస్సును నేను తీసి వేయు నెడల అక్కడ నాకే బాధము నుండదు.

*మంత్రము వలన శరీరము పావన మగును. భగవన్మంత్ర ముచ్చరించుట వలన మానవుడు నిర్మలుడగును.
*శరీరశుద్ధి కొరకైనను గురు ముఖమున మనము మంత్రోపదేశము నొందవలెను. చెవిలో మానవ గురువు మంత్ర ముచ్చరించునే గాని భగవంతుడే ఆత్మకు తేజస్సు వచ్చును. చిత్తశుద్ధి లేనిదే మన కేమియు లభింపదు. సాధకునకు గురు కటాక్షమును, భగవత్కటాక్షమును, వైష్ణవ కటాక్షమును కూడా కలిగినను ఒకని దయలేనిచో నతనికి దుఃఖము సంభవించును. మనస్సే ఆ యొకడు. సాధకునకు వాని మనస్సు సుముఖముగా నుండవలయును.
*ఈశ్వర కోటులు భగవంతుని యందే పూర్ణ కామసిద్ధిని గాంతురు . కనుక వారి కైహిక వాంఛ లేవియు నుండవు. ఏ విధమైన ఫలాపేక్ష లేని దివ్య ప్రేమ, ఆశయే మాత్రమున్నను నెవరికిని సాధ్యము కాదు.
*భగవంతుని శరణు జొచ్చిన వారి విషయమున విధించిన యాజ్ఞలనే, విధి మాపు చేయును. భగవత్సాక్షారమైన మానవు లెటుందురు. వారి తలపై కొమ్ములు మొలుచునా? అట్టి దేదియు జరుగదు. అట్టి వారికి నిత్యా నిత్య వివేచనా శక్తి వికసించి, అపరోక్ష జ్ఞానము కలిగి వారు జనన మరణముల కతీతులగుదురు. పరతత్త్వాను భవము కలవారే భగవంతుని తెలిసి కొనగలరు. మరి యొక విధమున అఖండ సచ్చిదానంద తన్మయత లేనిదే భగవంతుడెవరితో నైన సంభాషించి యున్నాడా? అట్టి మహోన్నత స్థితిలో మాత్రమే భగవంతుని సందర్శించి ఆయనతో మాట్లాడి సన్నిహిత సంబంధ మేర్పఱచు కొనుటకు మానవులకు వీలగును.
*నామ రూపములు తప్ప ఈ ప్రపంచములో వేఱేమియు లేవు. జడపదార్థమున్నదను విషయము ఋజువు చేయుటకు వీలులేనిది. కనుక భగవంతుడు మున్నగున వేవియు లేదను విషయమే చివరకు

తేలు సారాంశము.
*పరిపూర్ణజ్ఞానము కలుగనంతవరకు, హేతువాద మంతరింపదు.
*భగవంతునకు విశేశమైన శక్తి కలదు. ఇచ్చా మాత్రమున భగవంతుడు కావలెననిన ప్రపంచములుత్పన్నమగును, భగవంతుడు వలదనిన అవి యెల్ల నిర్మూల మగును.
*జపము మరియు పారమార్థిక సాధన : ఈ సాధనల వలన పురాకృత కర్మ బంధములు తొలగి పోవును. భగవంతుని యెడల ప్రేమ, భక్తి లేని యెడల భగవత్సాక్షారము లభింపదు. వీని వలన ఇంద్రియ నిగ్రహము కలుగును.
*భగవంతునకును భగవద్భక్తులకు భాగ్యవంతులు ధన రూపమున సేవ చేయవలెను. పేదలు భగవన్నామస్మరణ రూపమున భగవంతుని ఆరాధింప వలయును
ప్ర: భగవంతునికొరకు మన కాత్ర మెట్లు కలుగును?
జ : నీవట్టి గాఢవాంఛను బయడయగలుగుదువు. అందే భగవంతుని దయ కలదు.
*ఆశవలననే మనిషి శరీరమును విడిచి మఱియొక శరీరమును దాల్చుచున్నాడు. చివరకొక కలకండ పలుకును తినవలయునను ఆశయైన ఉన్నయెడల, అతనికి పునర్జన్మ కలుగును. ఆశను చిన్న విత్తనముతో పోల్చవచ్చును. మఱ్ఱి విత్తనము మిక్కిలి చిన్నది. అందుండి శాఖోపశాఖలుగల పెద్ద వృక్షము పెరుగును. ఒక ఒరలలో నుండి తీసి మరి యొక ఒరలో తలగడ నుంచునట్లు జీవాత్మ ఒక శరీరమును విడిచి మఱియొక శరీరమును దాల్చును. ఆశ లేవియు లేనివారు కోటికే యొకరో, యిరువురో మాత్ర ముందురు. ఆశవలన నూతన శరీరము వచ్చినను పూర్వ జన్మలలో పుణ్య కార్యములను చేసియున్న యెడల మానవునకు పారమార్థిక జానము పూర్తిగ నశింపదు .

*పరమాత్మాను భూతి కొఱకైన ప్రయత్నముల విషయములలో కూడ నిజము. ఈ జన్మలో జపమును కఠిన సాధనలను చేసిన యెడల, రాబోవు జన్మలో నీవింకను నెక్కువగా అభివృద్ధి గాంతువు. భగవంతు డొక శిశువు వంటి వాడు. అడుగని వారికి ఆ పరమార్థ మాతడిచ్చును. మరియొక రెంత అడిగినను వారికీయడు. అది యంతయు నాతని చిత్త విలాసము .
*నీ శరీరమును, మనస్సును భగవన్నామ స్మరణచే పరిశుద్ధము లగుగాక"
*భగవన్నామమును జపించి సార్థకము లగుటకే భగవంతుడు మనకు వేళ్ళ నిచ్చియున్నాడు.
శిష్యుడు :- జీవునకు సత్కర్మకుగాని, దుష్కర్మకుగాని మొట్ట మొదటి ప్రేరణ యెచ్చట నుండి వచ్చుచున్నది! ఈ జన్మ లోని ప్రేరణకు పూర్వ జన్మలో చేసిన కర్మలే కారణమని, ఆ పూర్వపు జన్మలోని ప్రేరణకు దానికి ముందుండిన చేసిన కర్మములే కారణమని సమాధాన రూపముగా మీకు చెప్ప వచ్చును. కాని దీనికి మొదలెక్కడ ?
అమ్మగారు: భగవంతుని సంకల్పము లేనిదే యేమియు జరుగదు; గడ్డి పరక కూడ చలింపదు. మంచి కాలము వచ్చినప్పుడు భగవంతుని ధ్యానించ వలెనను కోరిక మానవునకు కలుగును, చెడ్డకాలము వచ్చినపుడు దుష్కర్మలను చేయుటకు తగిన సదుపాయములన్నియు నాతనికి లభించును. భగవత్సంకల్పమును బట్టి యేదియెప్పుడు జరుగవలెనో అది అప్పుడు జరుగు చుండును. మనుషుల కర్మలలో దైవ సంకల్పము ప్రతిబింబించు చుండును. మన సదుపాయము లన్నియు మన కర్మలచే నిర్ణీత మగుచున్నందున, మనము సర్వ సహన భావము కలిగి యుండవలయును. ఇది యట్లుండ, కర్మలను కర్మలే హరించును. నీవు సత్కర్మ చేయుదువేని . అది నీ పురాకృత దుష్కర్మను పోనాడును. ధ్యాన, జప, పారమార్థిక చింతనాదుల బలిమిచే పూర్వ పాపములు

నశించును.
*ఆధ్యాత్మికోన్నతి నెక్కువగా గాంచిన జీవులు తప్ప మిగిలిన జనులందరు ప్రేత శరీరములో నొక సంవత్సరము వరకు నుందురు. పిమ్మట ఆ గతించిన జీవుల సంతృప్తి కొరకు గయలో పిండప్రదానము చేసి తర్పణము విడుతురు. దీని వలన, గతించిన జీవులకు ప్రేత శరీరము నుండి విమోచన కలుగును. తరువాత వారితర జీవలోకములకు వెళ్ళి, అచట సుఖమో దుఃఖమో కొంత కాల మనుభవించి వారి వారి కోరికలకు అనుగుణమైన మనుష్య జన్మ నెత్తుదురు. మఱి కొందరాలోకములో నుండియే, మోక్షమును బడయుదురు. ఈ జన్మలో నేదో యొక పుణ్య కార్యమును చేసిన మనుష్యునకు ప్రేతావస్థలో పారమార్థిక జ్ఞానము పూర్తిగా నశింపదు.
*గతించిన జీవులున్నతరస్థితిని బడసి అచ్చట కొంత కాల ముందురనుటకు సందేహము లేదు. కాని తరువాత వారు తమతమ పూర్వవాంఛలకు అనుగుణముగా ఈ లోకమున మరల జన్మింతురు. నరజన్మ నెత్తిన తరువాత వారిలో కొందరి కీ జన్మలోనే ముక్తి లభించును; మరికొందరు వారి వారి కర్మఫలముల ననుభవించుటకు హీనజన్మ లెత్తెదరు. ఈ ప్రపంచ మొక చక్రము వలె గిర గిర తిరుగు చుండును. ఆశలన్నియు ఏ జన్మలో పూర్తిగా తొలగి పోవునో, అదియే మనుష్యులకు తుది పుట్టుక.
*సూక్ష్మ శరీరము గాలితో చేయబడిన శరీరము వంటిది.
*జనులు చాలా జాగ్రత్తగా జీవింపవలయును. ప్రతి కర్మకు ఫలము తప్పక కలుగును. పరుషములాడి ఇతరుల నవమాన పరచుట కాని, వారి బాధకు కారణ భూతులగుట కాని యెవరికిని మంచిది కాదు.

*కాలక్రమమున భగవంతుడున్నట్లు కూడ మనకు అనిపించదు. జ్ఞాన వికాసము కలిగిన వాని దేవతలందరును మాయయని తోచును. సర్వమును కాలములో ఉత్పన్నమై, కాలములోనే అంత మొందును. నిజముగా భగవంతుడు మున్నగు విషయములు జ్ఞానోదయమైన తోడనే మాయమగును. అమ్మయే విశ్వమంతట నిండియున్నట్లు సాధకుడప్పుడు గ్రహించును. యథార్థమిదియే.

*భక్తుల సంతృప్తి కొరకే వారు నైవేద్య మారగింతురు. ఆ పవిత్ర ప్రసాదము వలన చిత్తశుద్ధి కలుగును. మొట్ట మొదట భగవంతునకు నైవేద్యము చేయకుండ నెవరైన భోజనము చేసిన యెడల వారి అంతఃకరణ అపవిత్రమగును.

*భగవంతుని మనమెంతవరకు ప్రేమించు చున్నామను విషయము కేవలము మన ఆంతరంగిక భావ తీవ్రత పై నాధారపడి యుండును. అన్నిటికిని భగవత్ప్రేమయే ముఖ్యము.

*కావలసినది భగవంతుని దయయే. కనుక జనులు భగవంతుని దయకొఱకు పార్థింపవలెను.

*సాధకులు నదీ తీరమున గూర్చొని భగవంతుని ప్రార్థింపవలయును. సముచిత కాలమున వారు తరింతురు.

*భగవంతుడు కేవలము మనసొంతమే. ఇదియే శాశ్వత సంబంధము . మనకు భగవంతుని యందు గల భక్తి తీవ్రతను బట్టి, మన కాయన సాక్షాత్కారము కలుగు చుండును.

*ఈ జాగ్రదవస్థ కూడా స్వప్నమే.

*నా భక్తుల అవసాన కాలమందు వారికి నే నండయె నిలువవలెను' అని శ్రీ రామకృష్ణులు చెప్పినారు..

*ఆధ్యాత్మికముగా తానెంత యెభివృద్ధిని గాంచెనో, తనకేపాటి జ్ఞానమును, భగవత్స్మృతియు కలిగెనో యే మనుష్యున కైనను వాని యంతరాత్మయే చెప్పును.
*తప్పక క్రమక్రమముగా మాయా బంధములను ద్రెంచి వైచుకొని, నిర్వాణమును చూఱగొని వారు భగవంతునిలో నైక్యమగుదురు. ఈ శరీరమునకు ఆశలే కారణము. ఇందుకు సందేహమేమియులేదు. ఆశా లేశము లేనిదే శరీరము జీవించి యుండజాలదు. ఆశలు పూర్తిగా నశించిన మానవునకు సర్వము సమాప్తము కానున్నదని దీని అర్థము.
*దేవతలు 'ను, అమరులు ను ఎంతటివారైనను ఈ భూమి పై మరల జన్మించుచున్నారు; సూక్ష్మ శరీరములతో వారాహారమును తినలేరు. మాటలాడలేరు. కనుక ఆ స్థితిలో వారు చాలా కాలము జీవింపజాలరు.
*యమలోకము, సత్యలోకము, ధృవలోకము మున్నగు వేర్వేరు పరలోకములు కలవు.
*భగవంతుని సేవ చేయుచుందురు (ఒకతరగతివారు). రెండవ తరగతి వారు యుగముల కొలది ధ్యాన నిమగ్నులై ఉందురు.
*నిర్వాణ సిద్ధియైన తర్వాత కూడా ఈశ్వరకోటి తన మనస్సుకు అనిర్వచనీయస్థితి నుండి క్రిందకు తీసికొని వచ్చి సామాన్య ప్రపంచ జ్ఞానావస్థకు మరలింపగలడు.
*ఆశలను విడువగలిగినచో ఈ సృష్టియే అంతమొందియుండును. ఆశల నందరును విడువలేదు కనుకనే, సృష్టి జరుగుచున్నది. ఆశలు కలవారు మరల మరల జన్మ మెత్తు చుందురు.
*జనన మరణముల నుండి ముక్తి , ఆశాలేశము కూడ లేనప్పుడు మాత్రమే, సుసాధ్యము. ఆశ యిసుమంతైన నున్నచో , దేనివలనను లాభము లేదు.

ఎవరికైనను భూమిపై నేటిదే కడసారి పుట్టుకయైనను, అట్టి మానవ వ్యక్తి ఆశలను విడనాడని యెడల మేమి లాభము?
*ఈ మాయా ప్రపంచమున సర్వజ్ఞుడై యుండగల వాడొక్క భగవంతుడే.
*భగవంతునిది శిశు స్వభావము. కొంతమంది అడిగినను వారి కీయడు. మరి కొందరడుగక పోయినను తీసుకొనుడని వారికిచ్చును. ఇట్లిచ్చినవారు బహుశః వారి వారి పూర్వ జన్మలలో పుణ్యకార్యము లెన్నియో చేసియుందురు. అందు చేత వారు భగవదనుగ్రహమునకు పాత్రులైరి. సర్వము మానవుల పురాకృత కర్మపై నాధారపడియున్నది. కర్మ అంతమొందిన వారికి భగవత్సాక్షాత్కారము కలుగును. అది యేవారి కడపటి జన్మము.
*భగవన్నామము స్మరించువాడెన్నటికి బాధపడరు. త్యాగమే వారి భూశణము.
*శరీర స్మారకము పోవుటకు మున్ను మనసున గల ప్రధాన భావమును బట్టి జీవుని మరణాంతర స్థితి ఏర్పడును.
*భక్తులకు నేను(శ్రీరామకృష్ణులు) మంత్రోపదేశము చేయునప్పుడు వారి పాపములు నేను భరింతును. అట్టి సమయమున, "ఈ శరీరమెట్లైనను పోవలసినదే! వారు సత్యమును గ్రహింతురుగాక!" అని తలంచుచుందును.
*పారమార్థిక విషయములలో సాధకుడు విశ్వాసము కలిగి యుండవలెను. దెవమను వస్తువొకటి మున్నదను దృఢవిశ్వాసము మానవునకున్నచో, అతనెన్నడైన సంసారములో నుండగలడా?"
*కర్మఫల మనుభవింపక తప్పదు. కాని భగవన్నామ స్మరణవలన దాని తీవ్రతను నీవు తగ్గించుకొన వచ్చును. నాగలి చాలంత పెద్ద పుండు నీకు

కలుగ వలసి యుండిన యెడల అధమ మొక సూది గుచ్చుకొని బాధ పడెదవు. జపతపములచే కర్మ ఫలమును చాలవరకు నిరోధించవచ్చును. పావన భగవన్నామస్మరణ కర్మ ఫలముల తీవ్రతను తగ్గించును.

*మనస్సే బహు ముఖ్యము. శుచిగ నున్నట్లు కాని అశుచిగా నున్నట్లు కాని యెవరికైనా మనస్సునందే తోచుచుండును. దోషపూరితమైన మనస్సు కలవాడే యితరుల దోషములను చూడగలుగును. ఇతరుల దోషము లెన్నుట వలన వారి కైన్నడైన నేమైనా సంభవించునా?

*నిర్మలమగు మనస్సుగల వారికి సర్వమును నిర్మలముగనే కనపడును. పూర్వజన్మమందు పారమార్థిక సాధనలను చాల కఠిన నియమముల నాచరించిన వారికి మాత్రమే పుట్టుకతో పవిత్రమైన అంతఃకరణ కలుగును.

*తరుణమున హెచ్చరిక చేయువాడే నిజమగు స్నేహితుడు. తరుణము మించిన తర్వాత 'అయ్యో' యని యెంత విలపించిన నేమిలాభము.

*భగవంతుని విషయమై యథార్థమును తెలిసికొనిననే తప్ప, పరమ సత్యమును గురించిన జ్ఞానమును పడయుట కెవరికైనా సాధ్యముగునా?

*భగవంతుని పాద పద్మములకు శరణాగతులైన వారికి ముక్తి లభించునను మాట నిజమే. కానీ జగదీశ్వరునకు ఆత్మార్పణము చేసికొన్న వారి విషయమును, మతాంతరుల విషయమును దీసికొనుడు. కాశీ నగర మంతయు పరంజ్యోతిర్మయము. ఇచ్చట జీవించు సమస్త జంతువులకును, పురుగులకు కూడా దివ్యప్రజ్ఞ కలదు. భక్తుడైనను, నాస్తికుడైనను, మతాంతరుడైనను చివరకు కీటకమైనను సరే, ఇచ్చట మరణించిన ప్రతి జీవికి తప్పక ముక్తి కలుగును.

*మహాత్ముల మాటల యందు నమ్మకము లేకున్నచో, నీవిక చేయగల దేమున్నది? మహర్షులును సాధుసత్తములును నడచిన మార్గము కాక వేరే మార్గమింకేమి కలదు.

*ఈ కలియుగమున కేవలము సత్యము నాశ్రయించిన వారికి భగవత్సాక్షాత్కారము లభించును. సత్యమును తప్ప నితర మెన్నడుమ పలుకని మానవుడు భగవంతుని ఒడిలో పరుండియున్నాడు.
*భగవంతుడే మన తల్లియును, తండ్రియును. భగవంతుడే మన తల్లియు తండ్రియు నగుచున్నాడు". గురుదేవులను ధ్యానించు వారికి సర్వ దివ్యాను భూతులు కలుగును. నన్ను స్మరించువారికి అన్నవస్త్రములలోటెన్న డుండదు. వారి కెట్టి లేమిడిగాని కలుగదు - వారిని స్మరించు చుండువారికి సమస్త కష్టములను తొలగి పోవును. శ్రీవారి భక్తులందరు నెంత సుఖముగా నున్నారో నీవు చూచుచుండుటలేనా?
*శ్రాద్ధ కర్మ సమయమున పెట్టబడు అన్నమును తినుట తగదు. పార మార్థిక జీవితమునకది హానికరము. నీవు తినునదెల్ల మొట్టమొదట భగవంతునకు నివేదన కావలెను. ఇటు నెవేద్యము కాని అన్నము నెవరును భుజింపకూడదు. మనము తిను అన్నమును బట్టియే, మన రక్తము కూడ ఉండును. నిర్మలమైన యాహారము నుండి నిర్మలమైన రక్తము, మనస్సు, బలమును కలుగును. చిత్తశుద్ధియున్నచో ప్రేమ భక్తి లభించును.
*భగవదర్పితమైన శ్రాద్ధాహారమును భక్తులు భుజింపవచ్చును.
*మెల్లమెల్ల గా మీకది అలవడును. ఈ జన్మలో కొంచెముగను, రాబోవు జన్మలో కొంచె మెక్కువగను ఈరీతిన మీరభివృద్ధి గాంతురు. శరీరము మాత్రమే మార్పునొందును; ఆత్మ యన్ననో, యెల్లప్పుడు నొకేరీతి నుండును.
*ఒకానొక వ్యాధికి అవసరమైన ప్రాయశ్చిత్తము చేసి కొనకుండ దాని వలన నే మానవుడైనను మరణించు నెడల వానికి రాబోవు జన్మలో అదే వ్యాధి సంప్రాప్తమగును., చనిపోవునపుడు సన్యాసి భగవన్నామము ను స్మరించును గనుక, నతనికి మోక్షము లభించును.

*ఒక మనుష్యుడు కుటుంబములో తన కర్మఫల విశేశము వలన మరల పుట్టి చచ్చుచుండును.
*మనస్సెన్నటికిని నిర్మలము కాదు. అపరిశుద్ధమైన మనస్సు, సులభముగా నిర్మలము కాదు.
*జ్ఞాని పునర్జన్మ కెపుడైనా భయపడునా? అతడే పాపమును చేయడు. నిరంతరము భయగ్రస్తుడగువాడు అజ్ఞాని . వాడే బంధములలో చిక్కుపడి పాప కళంకము నొందును. కోట్లకొలది జన్మల వరకు అనంతములైన దుఃఖములను, బాధలను అనుభవించి, తుట్టతుదకు భగవంతునే కాంక్షించును.
*మానవ జన్మలో నెట్టి సుఖమును లేదు ఈ లోకమంతయు నిజముగా దుఃఖమయము ఇచట సుఖమనునది నామమాత్రమే.
*సర్వ విశ్వాంతర్యామియగు భగవంతుని ప్రార్థింపుము. తన యమోఘాశీర్వాదము లాతడే నీ కనుగ్రహించును.
*అనంతమగు ఈ సృష్టి అంతయు భగవంతునిది. నీవు భగవంతుని బ్రార్థింపనిచో వాని కేమి లెక్క? భగవంతుని తలపెట్టనైన తలపెట్టని వారెందతో యున్నారు. నీవాతనిని స్మరింపనిచో నీవే దురదృష్టవంతుడవు. వాని మాయచే జనులు వానిని మఱచి యున్నారు. "వీరు బాగుగనేయున్నారు; వీరి నీట్లే యుండనిమ్ము " అని వారిని చూచి భగవంతుడను కొనుచుండును.
*దిగువకు ప్రవహించుట నీటి స్వభావము; కాని సూర్యుని కిరణములు నీటి నాకసము వైపునకు బైకి లేవ నెత్తుకొని పోవును. ఇట్లే మనస్సు సహజముగా తుచ్ఛ విషయుములపై, భోగ్య పదార్థములపై బోవుచుండును; కాని భగవంతుని దయయున్నచో మనస్సు మహోన్నత విషయములపై బోగలుగుచుండును."

*ధైర్యము విడనాడక ప్రార్థించు చుండుము. కాలక్రమమున సర్వమును ప్రాప్తించును. పూర్వకాలమున మునులు, ఋషులు నెన్ని యుగములు భగవంతునికొరకు తపస్సు చేసినను, కృతార్ధులు కాలేదు!
ఒక క్షణములో నీకు భగవంతుడు ప్రత్యక్షమగునను కొనుచున్నావా? ఈ జన్మలో కాకున్న రాబోవు జన్మలోనో, ఆ జన్మలో కాకున్న దాని తరువాతి జన్మలోనో నీ మనోరథము ఫలించును. భగవంతుడు ప్రత్యక్షమగుట అంత సులభమా? కాని యీ సారి శ్రీగురు దేవులు సులభమార్గమును కనబరచి యుండుటచే, భగవత్సాక్షాత్కారము బడయుటకు అందరకును సాధ్యమగును " అని అమ్మగారు చెప్పిరి
*నిర్మలాంతః కరణులకు ధ్యానమేల సాధ్యముకాదు? వారేల భగవంతుని చూడజాలరు? పరిశుద్ధాత్మలు జపము చేయునప్పుడు, భగవంతుని పావన నామము తమలోపలినుండి దానంతటది పాతాళగంగవలె పొంగి వచ్చుచున్నట్లు వారికి తోచును. నామ స్మరణ కొరకు వారెట్టి ప్రయాసగాని పడరు. నియమిత కాలములందు, బద్ధకమును వదలి పెట్టి, యెల్లరును ధ్యాన జపములను చేయవలయును.
*వార్ధక్యములో శరీరము బలహీనమగును. మనస్సునకు పటుత్వము తగ్గును. అట్టి సమయమున నేమైన చేయుటకు సాధ్యపడునా ?
మన మఠము లోని బాల సన్యాసులు చిన్న తనమందే తమమనస్సును భగవంతుని మనస్సు వైపునకు మరల్చుచుండు టెంతయు సమంజసము. అందుకిదియే వారికి సరియైన కాలము . (శిశ్యునితో) నాయనా! తపోనిష్ట పూజ మొదలగువాని నిప్పుడే యభ్యసింపుము. కొంతకాలమైన తరువాత నివి సాధ్య మగునా ? సాధింపవలసిన దెల్ల ఇప్పుడే సాధింపుము. ఇదియే సరియైన కాలము.

*ప్రతి దినము భగవన్నామము పదునైదు లేక యిరువది వేల సారు లుచ్చరించిన యెడల మనస్సు స్థిరముగా నిలుచును. ఇది స్వానుభవము వలన గ్రహించితిమి. మొట్టమొదట జనులు దీని నభ్యసించి తాము కృతార్థులు కానిచో లాభము కనుపడలేదని చెప్పు కొనవచ్చును కొంత భక్తితో వారు జపము నభ్యసింప వలయును. కాని వా రేమియు చేయక మేమేల కృతార్థుల మగుట లేదు. అని మొఱపెట్టుచుందురు.

*భగవన్నామమును నియమితమగు లెక్కగా జపమాలతోనో, వ్రేళ్ళపైననో, మానసికముగనో, యుచ్చరించుట వలన మనస్సు భగవంతుని వైపునకు మరలును. సహజముగా మనస్సు పలుత్రోవల పరుగులెత్తుచుండును. అది యీ సాధన వలన భగవంతుని వైపునకు తిరుగును. భగవన్నామ ముచ్చరించు చుండగా సాధకుడు తన ఇష్ట దైవ స్వరూపమును జూచి తన్మయుడగుచో, నతని జప మాగిపోవును. ధ్యానము నందు కృతార్థుడగు వానికి సర్వము లభించును. స్వత సిద్ధముగా మనస్సు నిలుకడ లేని వస్తువు . అందుకనే మనస్సును స్థిరముగా నిలుపుటకై, ఆరంభమందు కొంచెముగా శ్వాసను నిగ్రహించుచు సాధకుడు ధ్యాన మభ్యసింపనగును. ఇది మనస్సు నిశ్చలముగా నుండుటకు తోడ్పడును. కాని దీని నెవరైన మితము తప్పి చేసిన యెడల, మెదడునకు వేడి హెచ్చును. భగవద్దర్శనమును గూర్చి గాని, ధ్యానమును గూర్చి గాని నీవు సంభాషించవచ్చును గాని, మనస్సే సర్వము అను విషయమును మఱువకుము. మనస్సు స్థిరముగా నిలుచుచో, సాధకునకు సర్వము లభించును.

* మానవులు భగవంతుని మఱచు టెంతయు సహజము కనుక అవసరము కలిగినప్పుడెల్ల భగవంతుడే భూమిపై అవతరించి తానే

సాధనను చేసి ముక్తి మార్గమును తను బఱచును భగవంత డీసారి త్యాగాదర్శమును, లోకమునకు ప్రదర్శించెను"

అపూర్వ మాతృ భక్తి:-

తొమ్మిది నెలలు మోసి కని, పెంచిన తల్లిని పోషించి, సేవించడము ప్రతి ఒక్కరి బాధ్యత, జీవితమున అభ్యున్నతిని పొందుటకు దైవభక్తి గురుభక్తి, మాతృ భక్తి, పితృ భక్తి కలిగియుండవలెను.

****